సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 15 । జూలై । 2025



ఉపాధి కూలీకి ధీమా

జాబ్ కార్డు కలిగి ఉన్న ఉపాధి కూలీలను ఆదుకునేందుకు కేంద్రం బీమా సౌకర్యం కల్పిస్తుంది. వివరాలు 8లో ▸



ఆయిల్‌పామ్ సాగుకు రాయితీ

ప్రభుత్వాలు రాయితీలు ఇవ్వడంతో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వివరాలు 8లో ▸

అడ్మిషన్ గడువు పెంపు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ విధానంలో 2025- 26వ సంవత్సరానికి గానూ పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సులలో అడ్మిషన్ పొందేందుకు ఈనెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి 8008403635 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

45కు చేరిన సిగాచీ మృతుల సంఖ్య



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమలో చోటుచేసుకున్న ప్రమాదంలో 44 మంది మృతదేహాలను కుటుంబ సభ్యులకు అధికారులు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మదీనగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెస్ట్ బెంగాల్‌కు చెందిన తుడు తరపాడు (45) సోమవారం ఉదయం మృతి చెందాడు. ఈసందర్భంగా అధికారులు మృతుడి కుటుంబ సభ్యులకు తక్షణ సహాయం కింద రూ. లక్ష అందజేసి, అంబులెన్స్ ఏర్పాటు చేసి స్వస్థలానికి పంపించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఇప్పటివరకు 45 మంది కార్మికులు మృతి చెందారని, వివిధ ఆస్పత్రుల్లో 13 మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల పరిధిలోని గిరిజన సంక్షేమ మిని బాలికల గురుకులంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వర్తించేందుకు కుక్, ఆయా ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ నాగార్జునరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన మహిళా అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 21 సాయంత్రం 4 గంటలలోగా గురుకులంలో సమర్పించాలని తెలిపారు. టెన్త్ విద్యార్హత అని, రూ. 9,750 వేతనం చెల్లిస్తామన్నారు. ఇతర వివరాలకు 7981090652 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసేందుకు కుట్ర



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

జోగిపేట(అందోల్): ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతుందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ అన్నారు. సోమవారం జోగిపేట ఎమ్మార్వో కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 7,200 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను విద్యకు దూరం చేయాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, సన్నీ దినేష్, మహేష్, శ్రీలత, దీపిక, చోటు, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఏడు మండలాలు.. 2,508 రేషన్ కార్డులు



నర్సాపూర్: నియోజకవర్గంలోని ఏడు మండలాలకు 2,508 కొత్త రేషన్ కార్డులు వచ్చాయని ఆర్డీఓ మహిపాల్ సోమవారం తెలిపారు. వాటిని లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు. నర్సాపూర్ మండలానికి 354, శివ్వంపేటకు 428, కౌడిపల్లికి 615, కొల్చారానికి 384, మాసాయిపేటకు 249, వెల్దుర్తికి 385, చిలప్‌చెడ్ మండలానికి 93 రేషన్‌కార్డులు మంజూరైనట్లు వివరించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

శివ్వంపేట(నర్సాపూర్): శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులు అవగాహన పెంచుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి అన్నారు. సోమవారం శివ్వంపేటలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లపై 12 పాఠశాలలకు సంబంధించి 36 మంది ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం జిల్లాలో 25 పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసిందన్నారు. ఆయా పాఠశాలల్లో రూ. 10 లక్షల విలువ గల రోబోటిక్స్‌తో పాటు అధునాతన ప్రయోగ పరికరాలను అందజేసిందన్నారు. సైన్స్, టెక్నాలజీ, గణితం, ఇంజనీరింగ్‌పై విద్యార్థులు పట్టు సాధించేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చనాయక్, గెజిటెడ్ హెచ్‌ఎం, కోర్స్ కోఆర్డినేటర్ బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు.

చెరువులపై చిన్నచూపు!

మరమ్మతులకు నోచుకోని నీటి వనరులు

- 114 చెరువు లకు పది నెలల క్రితం రూ. 31.19 కోట్లు మంజూరు
- ఇంకా టెండర్ ప్రక్రియ పూర్తి చేయని నీటిపారుదలశాఖ
- పనులు ప్రారంభమయ్యేదెప్పుడు.. పూర్తయ్యేదెన్నడు..?
- ఖరీఫ్ సీజన్‌లోనూ ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకం



ఈ చిత్రంలో కనిపిస్తున్న చెరువు పుల్కల్ మండలం చిట్టారెడ్డికుంట. దీని మరమ్మతు కోసం 2024 సెప్టెంబర్ 25న రూ.15.90 లక్షలు మంజూరయ్యాయి. కానీ పదినెలలైనా నీటిపారుదల శాఖ ఇంకా టెండర్ ప్రక్రియ పూర్తి చేయకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఈ కుంట కింద ఉన్న ఆయకట్టుకు ఈసారి సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ఇలా జిల్లాలో సుమారు 114 చెరువుల మరమ్మతుల పరిస్థితి కూడా ఇదే తీరుగా ఉంది.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: చెరువుల మరమ్మతులకు అలసత్వం గ్రహణం పట్టుకుంది. నిధులు మంజూరై ఏడాది దగ్గర పడుతున్నప్పటికీ.. నీటి పారుదల శాఖ టెండర్ ప్రక్రియ పూర్తి చేయలేకపోయింది. దీంతో ఈ ఖరీఫ్ సీజన్‌లోనూ ఆయా చెరువుల కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. చిన్న నీటి వనరుల అభివృద్ధే లక్ష్యంగా జిల్లాలో మొత్తం 114 చెరువుల మరమ్మతులకు ప్రభుత్వం రూ. 31.19 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆందోల్ నియోజకవర్గం పుల్కల్ మండలంలో 23 చెరువుల మరమ్మతులకు రూ.4.96 కోట్లు, చౌటకూర్ మండలంలో 25 చెరువుల మరమ్మతులకు రూ. 5.21 కోట్లు, ఆందోల్ మండలంలో 37 చెరువులకు రూ.16.04 కోట్లు మంజూరయ్యాయి. అలాగే సంగారెడ్డి నియోజకవర్గంలోని సదాశివపేట, సంగారెడ్డి మండలాల్లో 29 చెరువుల మరమ్మతులకు రూ. 4.98 కోట్లు మంజూరయ్యాయి. ఆయా చెరువుల కట్టల బలోపేతం, తూముల లీకేజీలకు మరమ్మతులు, అలుగు రిపేర్లు, అవసరమైన చోట్ల గైడ్‌వాల్‌ల నిర్మాణం, కాలువల్లో పూడికతీత వంటి పనులు చేపట్టేందుకు ఈ నిధులు మంజూరయ్యాయి. ఇందులో కొన్ని చెరువులకు 2024 సెప్టెంబర్‌లో జీఓలు జారీ అయ్యాయి. అంటే దాదాపు పది నెలలు దాటింది. అయినప్పటికీ టెండరు ప్రక్రియ పూర్తి కాలేదు. దీంతో ఈ పనులు ప్రారంభమే కాకపోవడంతో ఆయా చెరువుల కింద ఉన్న ఆయకట్టుకు సాగు నీరందడం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

ఆ ఇద్దరు నేతల నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా..

అధికార కాంగ్రెస్‌లో ఇద్దరు కీలక నేతల నియోజకవర్గాలకు ఈ నిధులు మంజూరయ్యాయి. మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రత్యేకంగా తమ నియోజకవర్గాల్లోని చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయించుకున్నారు. జిల్లాలో ఈ రెండు నియోజకవర్గాల్లో మినహా, నారాయణఖేడ్, జహీరాబాద్, పటాన్‌చెరు నియోజకవర్గాలకు నిధులు రాలేదు. ఈ రెండు నియోజకవర్గాలకు ప్రత్యేకంగా నిధులు మంజూరైనప్పటికీ, పనులు జరగకపోవడంతో ఆయా చెరువుల పరిస్థితి మెరుగుపడటం లేదు.

ఎస్‌ఈ లేకపోవడంతో...

- ఈ పనులకు నీటిపారుదలశాఖ పర్యవేక్షక ఇంజనీర్ (ఎస్‌ఈ) కార్యాలయం టెండర్ ప్రక్రియను నిర్వహిస్తోంది. ప్రస్తుతం జిల్లాకు ఎస్‌ఈ లేకపోవడంతో టెండర్ ప్రక్రియను పూర్తి చేయలేకపోతున్నారు. ఈఎస్‌ఈగా పని చేసిన ఏసయ్య మేలో పదవీ విరమణ చేసిన విషయం విదితమే. అప్పటి నుంచి ప్రభుత్వం ఈ పోస్టులో ఎవరినీ నియమించలేదు. దీంతో టెండర్ ప్రక్రియ ముందుకుసాగడం లేదు.
- తొలిసారి నోటిఫికేషన్ ఇచ్చిన పుల్కల్, చౌటకూర్ మండలాలకు సంబంధించిన చెరువులకు ఈ ఏడాది ఫిబ్రవరిలో టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్‌లో ఈ నోటిఫికేషన్‌ను రద్దు చేశారు. మేలో మరోసారి నోటిఫికేషన్ జారీ చేశారు. తీరా ఎస్‌ఈ పదవీ విరమణ చేయడంతో ఈ టెండర్లను ఓపెన్ చేయలేదు.
- వర్షాలు ఎక్కువై చెరువుల్లో నీరు చేరితే ఈ మరమ్మతులు చేయడం వీలుకాదు. దీంతో ఈ పనులకు మూడు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తయితే.. కనీసం అక్టోబర్, నవంబర్‌లో నీటి మట్టాలు తగ్గాక పనులు చేసేందుకు వీలు కలుగుతుంది. కనీసం మూడు నెలల్లోనైనా టెండర్ ప్రక్రియను నిర్వహించి మరమ్మతులు పూర్తి చేస్తే ఆయా చెరువుల కింద ఉన్న ఆయకట్టు రైతులకు మేలు జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరాహార దీక్షలో కల్లు గీత కార్మిక సంఘం నాయకులు

సంగారెడ్డిటౌన్: జిల్లాలో కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఈత, తాటి చెట్లపై నుంచి పడి మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. అక్రమ మద్యం, బెల్ట్ షాపులను అరికట్టాలన్నారు. గీత కార్మికుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన సబ్సిడీ రుణాలను వెంటనే మంజూరు చేయాలని, సొసైటీలలో సభ్యులుగా ఉన్నవారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. సమస్యలపై అనేకసార్లు అధికారులు, మంత్రులకు తెలియజేసినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గీత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్గౌడ్, సంగారెడ్డి మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

18న జిల్లాకు బీజేపీ చీఫ్ రాక



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

నర్సాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఈనెల 18న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఎంపీ రఘునందన్‌రావు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మొదటి సారి జిల్లాకు వస్తున్నందున ఆయన పర్యటనను విజయవంతం చేయా లని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలు నిబంధనలు పాటించాలి

అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి

పటాన్‌చెరు టౌన్: అగ్ని ప్రమాదాల పట్ల పారిశ్రామికవేత్తలంతా అప్రమత్తంగా ఉండాలని, అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి పరిశ్రమలో రక్షణ పరికరాలు ఖచ్చితంగా ఏర్పాటు చేయాలని తెలంగాణ అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి తెలిపారు. సోమవారం పాశమైలారం ఐలా ప్రాంగణంలో పారిశ్రామికవేత్తలతో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా కాలంగా కొన్ని పరిశ్రమల్లో అగ్ని ప్రమాద నియంత్రణ చర్యలు లేవని, పలు పరిశ్రమల్లో ఉపయోగిస్తున్న కెమికల్స్ వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. నిపుణులైన కార్మికులను నియమించడం ద్వారా అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. రాష్ట్రంలో జరిగిన ప్రమాదాల్లో అగ్నిమాపకశాఖ సమర్థవంతంగా పనిచేసి ఎక్కువ ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా కృషి చేయడం హర్షించ తగిన విషయమన్నారు. కాగా సిగాచీ పరిశ్రమ ఘోర ప్రమాదం నేపథ్యంలో అలెర్ట్‌గా ఉండాలని, అగ్ని ప్రమాదాల విషయంలో నిబంధనలు పాటించని పరిశ్రమలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు పారిశ్రామికవేత్తలతో పాటు జిల్లా ఫైర్ అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిగాచీ యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి



అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సిగాచీ పరిశ్రమ యాజమాన్యాన్ని తక్షణమే అరెస్ట్ చేయడంతో పాటు పరిశ్రమలలో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వరుస ప్రమాదాలు జరిగి కార్మికులు చనిపోతున్నా ప్రభుత్వ అధికారులు స్పందించటం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి ముందస్తుగా తనిఖీలు చేపట్టి ప్రమాదాలు జరగకుండా నివారించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాణిక్యం, నాయకులు సాయిలు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి మెదక్ జిల్లా నాయకులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గ్రూపులొద్దు.. రచ్చకెక్కొద్దు

- విభేదాలొస్తే అంతర్గతంగా చర్చించుకోవాలి
- అవసరమైతే పీసీసీ దృష్టికి తీసుకురండి
- ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులకు పొన్నం సూచన

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: విబేధాలుంటే రచ్చకెక్కి మాట్లాడొద్దు.. ఏమైనా సమన్వయ సమస్య ఎదురైతే అంతర్గతంగా చర్చించుకొని పరిష్కరించుకోవాలి.. లేనిపక్షంలో టీపీసీసీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలి.. అంతేకానీ ఇష్టానుసారంగా మాట్లాడొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ నేతలకు సూచించారు. సోమవారం గాంధీభవన్‌లో సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల కీలక నాయకులతో సమావేశం జరిగింది. సంస్థాగత నిర్మాణం గ్రామ, మండల, జిల్లా కార్యవర్గం, అనుబంధ సంఘాల నియామకం తదితర అంశాలపై పొన్నం నేతలతో చర్చించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే నామినేటెడ్, పార్టీ పదవుల ఎంపికలో ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. ఒక్కో నియోజకవర్గానికి రెండు చొప్పున రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ల పోస్టులు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా అన్ని నామినేటెడ్ పదవులతో పాటు, పార్టీ సంస్థాగత పదవుల భర్తీ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఆయా పదవుల కోసం ఇచ్చిన జాబితాలపై పూర్తిస్థాయిలో కసరత్తు చేసి టీపీసీసీ, ఏఐసీసీ నాయకత్వానికి పంపుతామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు రాజిరెడ్డి, టి.నర్సారెడ్డి, నాయకులు ఉప్పల శ్రీనివాస్‌గుప్త, మెట్టుసాయికుమార్ పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం



మహిళలకు రాయితీ పథకం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఖేడ్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఇందిర మహిళాశక్తి విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలు మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ రాయితీకి సంబంధించి రూ. 2,87,82,000 చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాడు దివంగత వైఎస్సార్ మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు ఇచ్చారని, తర్వాత బీఆర్ఎస్ పట్టించుకోలేదన్నారు. తిరిగి తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు చేయూతనందిస్తుందని తెలిపారు. నియోజకవర్గంలోని మహిళా సంఘాల సభ్యులు ముందుకు వస్తే రెండు బస్సులు, పెట్రోల్‌బంక్‌లు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మండలంలోని వెంకటాపూర్ అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. రూ. 3.86 కోట్లతో అర్బన్ పార్కుగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డీఎఫ్ఓ శ్రీధర్‌రావు, రేంజ్ అధికారిణి అనురాధ, సిబ్బందితో కలిసి వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. అలాగే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గిరిజా షెట్కార్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, ఐకేపీ పీడీ జ్యోతి, డీపీఎం సుధాకర్, ఏపీఎంలు వంశీకృష్ణ, సాయిలు, అనంతయ్య, కుమార్, శేఖర్, సీసీలు, మహిళా సంఘాల సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ల్యాబ్‌లు నిర్వహించాలి

మెదక్ కలెక్టరేట్: అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను జిల్లాలో ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సైన్స్‌ను ప్రయోగశాలకు అనుసంధానం చేయాలన్నారు. సైన్స్, గణితం ఉపాధ్యాయులకు ల్యాబ్‌ల నిర్వహణపై అవగాహన కల్పించడానికి రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్‌మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ ప్రావీణ్య
- ప్రజావాణిలో వినతుల స్వీకరణ



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి జోన్: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ మేరకు 73 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని బాధితులు తమ గోడు వెల్లబోసుకున్నారు. సమస్యలతో ప్రభుత్వాలు అందించే పలు పథకాలు లబ్ధిపొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలియకుండానే పట్టా చేశారు



కోహీర్ మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామ శివారులో 5 ఎకరాల భూమి కొనుగోలు చేసి నా పేరున పట్టా చేసుకున్నా. గతేడాది డిసెంబర్‌లో కోర్టు నుంచి ఇతరుల పేరుపై భూమి మారిందని, స్థలం ఖాళీ చేయాలని అందించారు. సంబంధిత కార్యాలయంలో విచారణ చేయగా ఇతరుల పేరుపైకి భూమి మారిందంటూ నిర్లక్ష్యంగా అధికారులు సమాధానం ఇస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలి.

– శోభారాణి, శాంతినగర్, హైదరాబాద్

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



మొగుడంపల్లి మండల పరిధిలోని ధనసిరిలో తమ స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాడు. అధికారులు పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకొని ఇంటి నిర్మాణం జరిగే విధంగా చూడాలి.

– శివకుమార్, ధనసిరి, మొగుడంపల్లి

లక్ష్యం మేరకు రుణాలు అందించాలి

సంగారెడ్డి జోన్: మున్సిపాలిటీలో మెప్మా, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమన్వయం చేసి కార్మికులకు లక్ష్యం మేరకు రుణాలను అందించాలని కలెక్టరు ప్రావీణ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత స్వయం ఉపాధి కోసం ఉద్దేశించిన కార్యక్రమంపై సంగారెడ్డి మున్సిపాలిటీలో అవగాహన కల్పించాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడానికి ఫిట్టింగ్, ప్లాంటేషన్ వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రత్యేక అధికారులు విధిగా వసతి గృహాలను తనిఖీ చేయాలన్నారు.

క్లుప్తంగా

'ఐఐటీ'తో చింతమడక పాఠశాల భాగస్వామ్యం

సిద్దిపేటరూరల్: స్కూల్ కనెక్ట్ పేరుతో ఐఐటీ మద్రాస్ నిర్వహిస్తున్న కార్యక్రమానికి మండల పరిధిలోని చింతమడక పాఠశాల భాగస్వామ్యం అవుతున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి సోమవారం తెలిపారు. ఐఐటీలో చేరడానికి కావలసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, వివిధ కోర్సులకు సంబంధించిన కోడింగ్ తదితర వాటిపై అవగాహన, ఐఐటీ ప్రొఫెసర్లతో ఆన్‌లైన్‌లో విద్యార్థులు నేర్చుకుంటారని పేర్కొన్నారు. రాబోయే రెండేళ్లు భాగస్వామ్యం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బాల్‌రాజు, అజీజ్, రాందాస్, శ్రీహరి, రాంరెడ్డి, సత్తయ్య, శ్రీనివాస్‌రెడ్డి, పీడీ వెంకటస్వామి హర్షం వ్యక్తం చేశారు.

దాడి చేసిన వ్యక్తి రిమాండ్

నంగునూరు(సిద్దిపేట): మహిళపై దాడి చేసిన వ్యక్తిని సోమవారం రిమాండ్‌కు తరలించారు. రాజగోపాల్‌పేట ఎస్‌ఐ వివేక్ కథనం ప్రకారం .. రాంపూర్‌కు చెందిన గండికోట సంపత్, రాజవ్వను ఇదే గ్రామానికి చెందిన దున్నపోతుల నరేశ్, పరశురాములు, శారద పెంట్రింగ్ కర్రతో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నరేశ్‌ను కోర్టులో హాజరు పరచగా న్యాయ స్థానం 14 రోజుల రిమాండ్ విధించింది.

భార్యాభర్తల గొడవ... చిన్నారి మృతి



చిన్నారి ఆకాంక్ష

శివ్వంపేట(నర్సాపూర్): భార్యాభర్తల గొడవలో గాయపడిన చిన్నారి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై మధుకర్ రెడ్డి వివరాల ప్రకారం... మండల కేంద్రమైన శివ్వంపేట దళితవాడకు చెందిన కుంట లావణ్య, మహేష్ దంపతులకు నాలుగేళ్ల కూతురు చైత్రతో పాటు 11 నెలల కూతురు ఆకాంక్ష ఉంది. 10 రోజుల క్రితం బయటి నుంచి ఇంటికొచ్చిన మహేష్ అన్నం పెట్టమని భార్యను అడిగాడు. ఆమె చిన్న పాప ఏడుస్తుందని నీవే పెట్టుకుని తినమని చెప్పింది. దీంతో మద్యం మత్తులో ఉన్న మహేష్ భార్యపై దాడి చేసిన క్రమంలో ఇద్దరి మధ్య జరిగిన గొడవలో కూతురు ఆకాంక్ష తలకు బలమైన గాయమై అపస్మారకస్థితికి చేరుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం చిన్నారి మృతిచెందింది. లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెగిపడ్డ లిఫ్ట్ ..

పరిమితికి మించి ఎక్కడంతో ప్రమాదం

పలువురికి గాయాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): లిఫ్ట్‌లో పరిమితికి మించి ఎక్కడంతో ఒక్కసారిగా తెగిపడింది. ఈ ఘటనలో పలువురు మహిళా కార్మికులు గాయాలపాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం... కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన పలువురు మహిళలు ఆదివారం రాత్రి రామచంద్రాపురం పట్టణంలోని బట్టల దుకాణంలో దుస్తులకు ఉన్న ట్యాగులను తొలగించే పనికి వచ్చారు. సోమవారం ఉదయం వరకు పని చేశారు. ఇంటికి వెళ్లేందుకు రెండవ అంతస్తు నుంచి లిఫ్ట్‌లో సుమారు 14మంది లిఫ్టులో ఎక్కారు. ఒక్కసారిగా లిఫ్ట్ తెగి కిందకు పడిపోయింది. ఈ ప్రమాదంలో పింకీ అనే కార్మికురాలికి కాలు ఫ్రాక్చర్ అయింది. మిగితా వారికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంట్లో భారీ చోరీ

రూ.10 లక్షలు, బంగారం అపహరణ

చిన్నశంకరంపేట(మెదక్): తాళం వేసిన ఇంట్లో పట్టపగలే దొంగలు చొరబడి నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. ఈ ఘటన నార్సింగి మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా... మండల కేంద్రానికి చెందిన బోండ్ల శ్రీనివాస్ ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం భార్య, పిల్లలతో కలిసి పొలం వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. బీరువా తెరిచి ఉందని కుమారుడి పెళ్లి ఖర్చుల కోసం తీసుకువచ్చిన రూ.10 లక్షలు, 3 తులాల బంగారం, 10 తులాల వెండిని దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, ఇన్‌చార్జీ సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐ అహ్మద్‌మోహినొద్దీన్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్‌టీమ్ బృందం ఆధారాలు సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టిన బైక్

ప్రమాదంలో వ్యక్తి మృతి

జిన్నారం (పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన జిన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... దాదిగూడెం సోలక్‌పల్లి రహదారిపై టిప్పర్ లారీ బ్రేక్ డౌన్ కావడంతో డ్రైవర్ పక్కనే నిలిపాడు. ఈ క్రమంలో సోలక్‌పల్లి నుంచి జిన్నారం వైపు వస్తున్న మంబాపూర్కు చెందిన కంజర్ల సుదర్శన్ (40) ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి టిప్పర్‌ను ఢీకొట్టాడు. దీంతో అతడు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి ఒక కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

కూలీకి ధీమా.. ఉపాధి బీమా



ఉపాధిలో పనులు చేస్తున్న కూలీలు

రూ. 2 లక్షల వరకు కవర్

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సంవత్సరానికి రూ. 20 చెల్లింపు

సంగారెడ్డి జోన్: గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి స్థానికంగా పనులు కల్పించేందుకు అప్పటి యూపీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి 100 రోజులపాటు పనులు కల్పిస్తోంది. ఉపాధి పనులు కల్పించడంతో పాటు పని చేసే సమయంలో ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే ఆదుకునేందుకు బీమా సౌకర్యం సైతం కల్పిస్తుంది. దీంతో ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు మరింత ధీమా పెరుగుతుంది.

పీఎంఎస్‌బీవై ద్వారా అమలు

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉపాధి హామీ కూలీలకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం ద్వారా బీమా సౌకర్యం కల్పిస్తుంది. ఈ పథకంలో ఉపాధి హామీ కూలీగా ఉండి 18 నుంచి 70 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులుగా నిర్ణయించారు. కూలీ సంబంధిత జాతీయ బ్యాంకుతో బీమా చేయించుకునేందుకు అంగీకారం కుదుర్చుకొని ప్రతి సంవత్సరం రూ. 20 ప్రీమియం చెల్లించాలి.

గాయాలైతే లక్ష.. మృతి చెందితే రూ.2 లక్షలు

ఉపాధి హామీలో పని చేసే కూలీల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. ఉపాధి హామీ పనులు చేసే సమయంలో నిత్యం ఏదో చోట ఏదో ఘటన జరుగుతోంది. గాయాల పాలవడంతో పాటు మృత్యువాత పడిన సందర్భాలు సైతం ఉన్నాయి. బీమా ప్రీమియం చెల్లించిన వారికి ప్రమాదవశాత్తు గాయాలై పనిచేయని స్థితిలో ఉన్న వారికి రూ.లక్ష, మృత్యువాత పడితే రూ.2లక్షల బీమా వర్తిస్తుంది.

నాలుగు లక్షల మందికి లబ్ధి

జిల్లాలోని 619 గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కొనసాగుతుంది. ఆయా గ్రామాల్లో రెండు లక్షల 19 జాబ్ కార్డులు ఉండగా.. ఒక లక్ష 32 వేల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. అందులో సుమారు నాలుగు లక్షలకు పైగా ఉపాధి హామీ కూలీలు నమోదై ఉన్నారు. దీంతో సుమారు 4 లక్షల 3వేల మందికి లబ్ధి చేకూరనుంది. కూలీలకు లబ్ధి పొందాలంటే ప్రవేశపెట్టే పథకంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇదిలా ఉండగా ఉపాధిలో 18 నుంచి 70 సంవత్సరాలు లోపు ఉన్న కూలీల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

జిల్లాలో ఉపాధి హామీ పనుల వివరాలు

గ్రామ పంచాయతీలు	619
జిల్లాలో ఉన్న మొత్తం జాబ్ కార్డులు	2.19 లక్షలు
యాక్టీవ్‌గా ఉన్న జాబ్‌కార్డులు	1.32 లక్షలు
ఉపాధి హామీ కూలీలు	4.03 లక్షలు

ఉపాధి పనులపై ఆసక్తి

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉపాధి హామీని మహిళలే అత్యధికంగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యంగా వేసవిలో ఇతర పనులు లేకపోవడంతో ఉపాధి పనులకు డిమాండ్ పెరుగుతుంది. రైతు సంక్షేమం కోసం చేపట్టే పనులతోపాటు ఇతర అభివృద్ధి పనులు చేపపడుతున్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వాలు కూలీ రేటును పెంచుతున్నాయి. ప్రస్తుతం ఒకరోజు రూ. 307గా నిర్ణయించారు.

బెట్టింగ్, డ్రగ్స్‌ను తరిమికొట్టాలి

- శాంతి భద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్
- మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

అల్లాదుర్గం(మెదక్): బెట్టింగ్, డ్రగ్స్‌ను యువత తరిమికొట్టాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని ముస్లాపూర్ గ్రామంలో మెదక్ ఎస్పీ శ్రీనివాస్ రావ్ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, 10 మంది ఎస్‌ఐలు, 110 మంది పోలీస్ సిబ్బందితో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సోదాలు చేపట్టారు. సరైన ధ్రువ పత్రాలు లేని 60 ద్విచక్రవాహనాలు, 4 ఆటోలు, 2 బులోరా వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని సూచించారు. బెట్టింగ్ యాప్‌లతో ఎంతో మంది జీవితాలు నాశనం చేసుకున్నారని తెలిపారు. కార్డెన్ సెర్చ్‌తో గ్రామాల్లో ఎవరైన సంఘ విద్రోహ శక్తులు తల దాచుకుంటే పట్టుకునే అవకాశం ఉందన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిపోయిన పాప.. క్షేమంగా అప్పగింత



పాపను అంగన్‌వాడీ టీచర్‌కు అప్పగిస్తున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: తప్పిపోయిన పాపను పోలీసులు వివరాలు తెలుసుకుని వారి బంధువులకు అప్పగించారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం.. పట్టణంలోని శంకర్‌నగర్‌లో ఆరె అర్జున్ తన భార్య, కూతురు దివ్య(4)తో కలిసి నివాసం ఉంటున్నాడు. అర్జున్ పాత బట్టలు విక్రయిస్తుంటాడు. సోమవారం తండ్రి పాత బట్టలు విక్రయించడానికి వేములవాడకు వెళ్లడంతో పాప ఇంటి వద్దే ఉంది. ఈ క్రమంలో పాప ఆడుకుంటూ ఇంటి నుంచి బయటకు వచ్చి స్థానిక బాలాజీ థియేటర్ సమీపంలో ఏడుస్తూ ఉండగా.. గమనించిన ఓ వ్యక్తి టూటౌన్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించాడు. సీఐ ఉపేందర్ వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేయగా పాప ఏడుస్తూ తన పేరు దివ్య అని మాత్రమే చెప్పింది. దీంతో సీఐ తమ సిబ్బంది ద్వారా పాప ఫొటోను అన్ని వాట్సప్ గ్రూప్‌ల ద్వారా వైరల్ చేశారు. పాపను గుర్తించిన అంగన్‌వాడీ టీచర్ పీఎస్‌కు వచ్చింది. దీంతో వివరాలు తెలుసుకుని పాప పెద్దనాన్న కూడా అక్కడికి రావడంతో పోలీసులు వారికి అప్పగించారు.

మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో..

- యువకుడి దారుణ హత్య
- పోలీసులకు లొంగిపోయిన నిందితులు
- జహీరాబాద్‌లో ఘటన



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సైదా నాయక్

జహీరాబాద్ టౌన్: మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో ఓ యువకుడిని దారుణంగా హత్య చేశారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో ఈ ఘటన జరిగింది. సోమవారం డీఎస్పీ సైదా నాయక్, టౌన్ సీఐ శివలింగంతో కలసి ఈ కేసు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బసవేశ్వర మోహల్లాకు చెందిన తాజోద్దీన్ (22) మహీంద్ర ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతడికి మంత్రాలు వస్తాయని, అమావాస్య, పౌర్ణమి రోజుల్లో మంత్రాలతో తమ కుటుంబ సభ్యులను అనారోగ్యానికి గురి చేస్తున్నాడని మాణిక్‌ప్రభు వీధికి చెందిన ఎండీ హసన్ ఖురేషికి అనుమానం కలిగింది. ఇదే విషయమై పలు మార్లు ఖురేషి, తాజోద్దీన్‌ను హెచ్చరించాడు. ఈ నేపథ్యంలో తమ కుటుంబ సభ్యుల ఆరోగ్యం దెబ్బతీస్తున్నాడనే అనుమానంతో ఎలాగైన తాజోద్దీన్‌ను హత్య చేయాలని ఖరేషి నిర్ణయించుకున్నాడు. ఆదివారం ఉదయం 11.30 ప్రాంతంలో తాజోద్దీన్ నాగులకట్ట ప్రాంతానికి వెళ్లడాన్ని ఖురేషి చూశాడు. దీంతో తన మిత్రుడు ముఖ్రంతో కలసి బైక్‌పై ఆ ప్రాంతానికి వెళ్లాడు. ఒక విషయం మాట్లాడాలని చెప్పి.. తాజోద్దీన్‌ను బైక్‌పై ఎక్కించుకుని చెన్నారెడ్డి నగర్ కాలనీ వద్ద గల చెరకు తోట లోపలికి తీసుకెళ్లారు. అక్కడ తాజోద్దీన్ చేతులు కట్టేసి ఇద్దరూ కలిసి తీవ్రంగా కొట్టారు. అనంతరం హసన్ ఖురేషి వెంట తెచ్చుకున్న కత్తితో తాజోద్దీన్ మెడపై నరకడంతో అతను అక్కడికక్కడే చనిపోయాడు. మృతదేహాన్ని అక్బర్ అనే వ్యక్తికి చెందిన కారులో తీసుకెళ్లి ఓ బావిలో పడేశారు. అనంతరం ముగ్గురూ పోలీసు స్టేషన్‌కు వచ్చి లొంగిపోయారు. వారు ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు తాజోద్దీన్ మృతదేహాన్ని గుర్తించి, నిందితుల నుంచి కారు, మూడు బైక్‌లు, కత్తితో పాటు 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్వాక్రా సొమ్ము స్వాహా..

కొండపాక(గజ్వేల్): డ్వాక్రా మహిళా సంఘాల గ్రూపుల డబ్బులను వీవోఏ అక్రమంగా వాడుకున్న ఘటన మండలంలోని సిర్సనగండ్ల గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా... గ్రామంలోని సుమారు 12 మహిళా సంఘాల గ్రూపులకు చెందిన సుమారు రూ. 4 లక్షల 70 వేలను వీవోఏగా పని చేస్తున్న వ్యక్తి రెండేళ్లుగా వాడుకుంటున్నాడు. తిరిగి ఈ డబ్బులను గ్రూపుల పేరిట నెల నెలా చెల్లించడం లేదు. సోమవారం గ్రామంలోని సంఘం భవనంలో ఐకేపీ ఏపీఎం మగ్దుమ్ అలీ మహిళా సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి మహిళా సంఘాల గ్రూపులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల చెల్లింపులు, తదితర వాటిపై చర్చ జరిగింది. ఈ క్రమంలో కొన్ని గ్రూపులకు తెలువకుండా బ్యాంకుల నుంచి డబ్బులు తీసుకొని చెల్లించడం లేదనే విషయం బయటకు వచ్చింది. ఈ విషయంలో సీసీలు, ఐపీఎం ఏం చేస్తున్నారంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాడుకున్న డబ్బులు చెల్లించేలా మహిళా సంఘాల గ్రూపు సభ్యుల ఎదుట సదరు వ్యక్తి ఒప్పుకున్నాడని, ఈ విషయాన్ని పై అధికారులకు నివేదిస్తామని ఏపీఎం మగ్దుమ్ అలీ పేర్కొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

మాజీ ఎయిర్ మార్షల్ చంద్రశేఖర్

ములుగు(గజ్వేల్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మాజీ కమాండెంట్ దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ ఎయిర్ మార్షల్ బవిశెట్టి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మక్కపల్లిలోని ఓ ఫంక్షన్‌హాలులో శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలకు కప్స్‌తో పాటు మెమెంటోలు, మెడల్స్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తి, సామాజిక సేవను అలవర్చుకోవాలన్నారు. అనంతరం ట్రస్ట్ అధ్యక్షుడు విష్ణుజగతి కార్యక్రమానికి హాజరైన అతిథులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, ఆయా పాఠశాలల, ట్రస్ట్ ప్రతినిధులు రాజశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, శేషారెడ్డి, రామ్ నరసింహాగౌడ్, చంటి, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, కృష్ణ, పురుషోత్తం, సుధాకర్, విజయేందర్‌రెడ్డి, విజయ్ పాల్‌రెడ్డి, చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎయిర్ మార్షల్ చంద్రశేఖర్

వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యం



బాలమణి

జిన్నారం (పటాన్‌చెరు): ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం ... నగరానికి చెందిన సూరారం బాలమణి అనే వృద్ధురాలు సోమవారం ఉదయం ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేదు. వృద్ధురాలి జాడ తెలిస్తే 95029 74643 నంబరుకు తెలియజేయాలని కుటుంబ సభ్యుడు అనిల్ విజ్ఞప్తి చేశారు.

ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి..



చదువుల వెంకటేష్

సంగారెడ్డి క్రైమ్: వ్యక్తి అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేష్ వివరాల ప్రకారం... శివాజీ నగర్ చెందిన చదువుల వెంకటేష్ (28) వృత్తిరీత్యా పట్టణంలో ఎలక్ట్రీషియన్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా మానసిక ఒత్తిడితో బాధపడుతూ, ఎవరితోనూ సరిగా మాట్లాడటం లేదు. ఈ నెల 12న రాత్రి 9గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు ప్రక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంగారెడ్డిలో మహిళ...

ఇంట్లో నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైంది. పట్టణ సీఐ వివరాల ప్రకారం... పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన మహిళ (25), ఈ నెల 14న సోమవారం ఉదయం 10గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిన మహిళ తిరిగి రాలేదు. చుట్టు ప్రక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కస్తూర్బా పాఠశాల విద్యార్థిని..

చేగుంట(తూప్రాన్): విద్యార్థిని అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు...ఈనెల 2న నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం అంగర్క గ్రామానికి చెందిన బాలికను ఇంటర్ మొదటి సంవత్సరం చదివేందుకు రెడ్డిపల్లి కస్తూర్బా బాలికల పాఠశాలలో చేర్పించారు. ఈనెల 7న బాలిక తల్లినని పాఠశాల ఎస్‌ఓ శ్రీవాణికి ఫోన్ చేసి బాలిక మేనమామను పంపిస్తున్నట్లు అతడితో తన కూతురుని పంపించాలని కోరింది. నమ్మిన పాఠశాల సిబ్బంది బాలికను ఇంటికి పంపించేందుకు అనుమతించారు. ఆ తర్వాత రెండు రోజులకు సిబ్బంది బాలిక కుటుంబీకులకు ఫోన్ చేసి పాఠశాలకు పంపించాలని కోరడానికి ప్రయత్నించగా బంధువులు ఎవరూ ఫోన్‌లో స్పందించలేదు. అనుమానంతో ఎస్‌ఓ శ్రీవాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా బాలికకు ఇటీవలే వివాహం జరిగినట్లు సమాచారం. ఈ విషయమై కస్తూర్బా ఎస్‌ఓను వివరణ కోరగా బాలిక అదృశ్యం విషయం తెలిపేందుకు నిరాకరించారు. ఎస్‌ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

కల్వర్టును ఢీకొట్టిన కారు

వ్యక్తి మృతి



అనిల్

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మెదక్ – జోగిపేట ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని పైతర గ్రామానికి చెందిన మరెల్లి అనిల్(28)జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాడు. మెదక్ నుంచి స్వగ్రామానికి తన కారులో ప్రయాణమయ్యాడు. చిన్నఘనాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు రాగానే కారు అదుపుతప్పి పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టింది. దీంతో అనిల్‌కు ఛాతీలో బలమైన దెబ్బ తగిలి స్పృహ తప్పి పడిపోయాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అనిల్ మృతి చెందినట్లు తెలిపారు.

సెంట్రింగ్ చోరీ ముఠా అరెస్ట్

- 9 మంది నిందితుల రిమాండ్
- సామగ్రి, ఆటో స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్

పటాన్‌చెరు టౌన్: సెంట్రింగ్ సామగ్రిని దొంగిలించిన ముఠాను అరెస్టు చేశామని అమీన్‌పూర్ పోలీసులు తెలిపారు. సోమవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ ప్రభాకర్ వివరాలు వెల్లడించారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లోని మెడికల్ డివైస్ పార్క్‌లో భవన నిర్మాణం చేపట్టిన కాంటినెంటల్ బిల్డింగ్ సంస్థ భవనం నిర్మాణం పూర్తి కావడంతో సెంట్రింగ్ సామగ్రిని షెడ్డులో భద్రపరిచారు. జూన్ 21, 22న సామగ్రిని గుర్తు తెలియని దుండగులు దొంగిలించారు. దీంతో కంపెనీ సూపర్‌వైజర్ కృష్ణ చైతన్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా క్రైమ్ సీఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి సుల్తాన్‌పూర్ సర్వీస్ రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఆటోను ఆపడంతో అందులో పాత నేరస్తులు ప్రసాద్, అనిత ఉన్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా మెడికల్ డివైస్ పార్క్‌లో సెంట్రింగ్ చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. రామచంద్రపురం, లింగంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గుడిసెలు వేసుకుని ఉంటున్న జమున, ప్రసాద్, అనిత, రవీన, రాహుల్, ఫాతిమా, నందిని, అంజలి, సుశీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సెంట్రింగ్ సామగ్రిని ఇక్రిశాట్ కాంపౌండ్ ప్రక్కన దాచినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు రూ.5 లక్షల విలువైన సామగ్రితో పాటు ఒక ఆటో, రెండు ఐరన్ రాడ్లు స్వాధీనం చేసుకొని, 9 మందిని రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో రవీనా ఓ దొంగతనం కేసులో నిందితురాలుగా ఉన్నది. కేసు ఛేదించిన సీఐ నరేష్, క్రైమ్ సీఐ సత్యనారాయణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అధికారుల సంతకాలు లేకుండా చెల్లింపులు

రూ.22 వేల రికవరీ, 63 వేల జరిమానా



పనుల వివరాలు తెలుపుతున్న అధికారులు

నంగునూరు(సిద్దిపేట): ఉపాధిహామీ పనుల మస్టర్‌పై ఎంపీడీఓ, ఏపీఓ సంతకాలు లేకుండానే చెల్లింపులు జరిగాయి. తనిఖీలో అవినీతి జరిగినట్లు గుర్తించి అధికారులు రికవరీ చేసి , జరిమానా విధించారు. నంగునూరులో సోమవారం 16వ జాతీయ ఉపాధిహామీ పనులపై ప్రజాదర్బార్ నిర్వహించారు. మార్చి నుంచి జూన్ వరకు మండలంలో జరిగిన పనులపై గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ వివరాలు వెల్లడించారు. గ్రామసభలకు కొందరు టీఏలు, అసిస్టెంట్లు రాలేదని, పనులు ఒకరు చేస్తే డబ్బులు మరొకరికి చెల్లించారని, మస్టర్లలో చాలా తప్పులున్నాయని ఆడిట్ బృందం సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. పనుల్లో అవకతవకలు జరిగినట్లు తేలడంతో ఎఫ్‌ఏల నుంచి రూ.22వేల రికవరీ, 63 వేల జరిమానా విధించినట్లు డీఆర్‌డీఓ అసిస్టెంట్ పీడీ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ మేనేజర్ గణేశ్, క్వాలిటీ కంట్రోల్ అధికారి సంతోష్‌రెడ్డి, ఎస్‌ఆర్‌పీ భగవత్‌రావు, ఎంపీడీఓ లక్ష్మణప్ప పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు రాయితీ బాగు..



ఆయిల్ పామ్ తోట

ఆసక్తి చూపుతున్న రైతులు

- లక్ష్యం 3,750 ఎకరాలు
- 2 వేల ఎకరాల్లో సాగు

జహీరాబాద్ టౌన్: ఒకప్పుడు ధరలేక సాగు చేసేందుకు రైతులు ముందుకు రాలేదు. వందశాతం లాభాల భరోసా కల్పిస్తూ ప్రభుత్వాలు రాయితీలు ఇవ్వడంతో ఆయిల్ పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వంట నూనెల కొరతను అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. సాగు విస్తీర్ణం పెంచేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటుంది. రైతులను ప్రోత్సహించేందుకు గెలల ధరలు పెంచుతోంది. రాయితీ సొమ్మును జమ చేస్తుండటంతో ఆయిల్ పామ్ తోటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

జిల్లాలో పలువురు రైతులు ఆయిల్ పామ్ తోటలను పెంచడానికి ముందుకు వస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సాగు విస్తీర్ణం పెంచడానికి సబ్సిడీపై మొక్కలు, ఎరువులు, డ్రిప్‌ను అందిస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుంది. తెగుళ్లు, చీడ పురుగుల ప్రభావం తక్కువగా ఉంటుంది. కోతులు, అడవి పందుల బెడద ఉండదు. తోటలో అంతర పంటలను కూడా సాగు చేసుకోవచ్చు. మొక్కలు నాటిన నాలుగో ఏడాది నుంచి పంట మొదలై 30 ఏళ్లపాటు ప్రతి సంవత్సరం ఆదాయం వస్తుంది.

రేండేళ్లుగా ముమ్మరంగా..

రెండు, మూడేళ్ల నుంచి ఆయిల్ పామ్ సాగు ముమ్మరంగా సాగవుతుంది. జిల్లాలోని జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంఘం మండలాల్లోని రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతోంది. ప్రస్తుతం జిల్లాలో 2వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. 2025–26 సంవత్సరానికి 3,750 ఎకరాల లక్ష్యం కాగా ఇప్పటి వరకు 2,500 ఎకరాలకు రైతుల పేర్లను నమోదు చేసుకున్నారు. ఇప్పటికే 1,045 ఎకరాలకు పరిపాలన మంజూరు కూడా వచ్చింది. ఆయిల్ పామ్ సాగు చేసే ఎస్సీ, ఎస్టీ రైతులకు డ్రిప్ పరికరాలు 100 శాతం, ఇతర రైతులకు 80 శాతం రాయితీపై ఐదు హెక్టార్ల వరకు ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పిస్తుంది.

పెరిగిన ధరలు

ఆయిల్ పామ్ గెలల ధరలు పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టన్నుకు రూ. 20,506 ఉండగా తాజాగా టన్నుకు రూ. 20,871కి చేరుకుంది. ఐదారు నెలల్లో రూ. 365 పెరిగింది. మార్కెటింగ్ ఇబ్బంది లేకుండా గోద్రేజ్ కంపెనీ వారు గెలలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది.

వందశాతం భరోసా



ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. పంట వల్ల భవిష్యత్‌లో లబ్ధి చేకూరుతుంది. సాగు చట్టబద్ధతతో కూడుకుంది. గెలలను గోద్రేజ్ కంపెనీ కొనుగోలు చేస్తుంది. సాగు కోసం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు ఇస్తున్నాం. జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంఘం మండలాల్లోని రైతులు సాగులో ముందున్నారు. మిగతా ప్రాంత రైతులు ముందుకురావాలి.

-సోమేశ్వర్‌రావు, ఉద్యానశాఖ జిల్లా డీడీ, సంగారెడ్డి